క్లుప్తంగా

పంట నమోదుకు ఈకేవైసీ తప్పనిసరి



మాట్లాడుతున్న ఏడీఏ ఉమ

ఐరాల: వ్యవసాయ సంబంధిత రుణాలు పొందేందుకు రైతులు పంట నమోదుతోపాటు ఈకేవైసీ తప్పకుండా చేయించుకోవాలని ఏడీఏ ఉమ సూచించారు. స్థానిక ఆర్బీకేలో బుధవారం ఆమె సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పీఎం కిసాన్‌కు సంబంధించి ఈ–కేవైసీ పెండింగ్‌లో ఉన్న రైతులచే నమోదు ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏఓ వరలక్ష్మి, వీఏఏలు పాల్గొన్నారు.

వైభవంగా కుంభాభిషేకం



హోమ పూజలో పాల్గొన్న గల్లా రామచంద్రనాయుడు

పూతలపట్టు: మండలంలోని పేటమిట్ట గ్రామంలో శ్రీ కోదండరామస్వామి విగ్రహప్రతిష్ట, కుంభాభిషేక వేడుకలను మూడవ రోజు ఘనంగా నిర్వహించారు. ఆలయ చైర్మన్ గల్లా రామచంద్రనాయుడి ఆధ్వర్యంలో బుధవారం ఉదయం గణపతి, వేణుగోపాల విగ్రహాలకు పూజలు నిర్వహించి మూషికవాహనం, వేణుగోపాల స్వామివారికి విగ్రహ స్థాపన చేశారు. అనంతరం శ్రీరామ సహస్రనామ వాహనం, ఆంజనేయ సహస్ర హోమాలు, దర్బారు సేవ, చతుర్వేద స్వస్తి పూజలు నిర్వహించారు. అనంతరం గల్లా అరుణకుమారి, జయదేవ్ చేతుల మీదుగా తీర్థ ప్రసాదాలు అందజేశారు. సాయంత్రం పండరి భజనలు, కోలాటం వంటి సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. కుంభాభిషేక మహోత్సవాలు నేటితో ముగియనున్నట్లు గల్లా రామచంద్ర నాయుడు తెలిపారు.

ఎంఅండ్‌పీ డీఈగా జిరాదుద్దీన్

చిత్తూరు రూరల్: జిల్లా విద్యుత్‌శాఖ ఎంఅండ్‌పీ డీఈగా జిరాదుద్దీన్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన విద్యుత్ శాఖ తిరుపతిలోని కార్పొరేట్ కార్యాలయం నుంచి బదిలీ అయ్యారు. విద్యుత్ శాఖ చిత్తూరు టౌన్, చిత్తూరు రూరల్, పీలేరు, మదనపల్లె, పుంగనూరు డివిజన్లలో మీటర్లు, ప్రొటెక్షన్ నిర్వహణ పటిష్టతకు కృషి చేస్తానని ఆయన తెలిపారు.

నేడు టమాట సాగుపై సదస్సు

చౌడేపల్లె: టామాట సాగుచేసే రైతులకు గురువారం ఉదయం 10గంటలకు పొదలపల్లె సమీపంలోని మోహన్‌రెడ్డి నర్సరీ వద్ద నియోజకవర్గస్థాయిలో అవగాహన సదస్సు ఏర్పాటు నిర్వహించనున్నట్లు ఉద్యానవన అధికారి సంతోషి కుమారి తెలిపారు. బెంగళూరు నుంచి ప్రముఖ శాస్త్ర వేత్తలు హాజరై పంట సాగు, దిగుబడి, సస్య రక్షణమందుల వాడకంపై అవగాహన కల్పిస్తారని పేర్కొన్నారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గర్భిణులకు అన్నదానం

నగరి: వైద్య పరీక్షల నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే గర్భిణులకు బుధవారం రోజా చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఉచితంగా పౌష్టికాహారం అందజేశారు. గర్భధారణ పరీక్షల సమయంలో ఆస్పత్రిలో ఉండాల్సి వచ్చే వారు భోజనానికి ఇబ్బంది పడకూడదన్న ఉద్దేశంతో ఉచిత భోజనం అందించే మహత్తర కార్యక్రమాన్ని మంత్రి ఆర్కేరోజా నిరంతరాయంగా నిర్వహిస్తున్నారు. గర్భిణులతో పాటు వారి వెంట వచ్చే వారికి కూడా ఉచితంగా వెజిటబుల్ రైస్, గుడ్డు, పుదీనా చట్నీ, చిక్కీ, అరటిపండు, రైతాతో కూడిన పౌష్టికాహారం అందజేస్తున్నారు. మెడికల్ సూపరింటెండెంట్ ప్రభావతి, వైద్యులు కార్తీక్, నర్సింగ్ సూపరింటెండెంట్ రాజారత్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌స్పైర్ విజేతకు అభినందనలు



ఆశను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

పుత్తూరు: తిరుపతి జిల్లా ఇన్‌స్పైర్ మనక్ ప్రదర్శనలో రాష్ట్ర స్థాయికి అర్హత సాధించిన విద్యార్థిని ఆశను ఆదర్శంగా తీసుకోవాలని సమగ్ర శిక్ష సెక్టోరియల్ ఆఫీసర్ కె.ధనుంజయ సారథి సూచించారు. గోపాలకృష్ణాపురం జెడ్పీహెచ్ఎస్‌లో బుధవారం విద్యార్థిని అభినందించారు. ఈ నెల 10, 11 తేదీల్లో శ్రీకాళహస్తిలో నిర్వహించిన జిల్లా స్థాయి ఇన్‌స్పైర్ విజ్ఞాన శాస్త్ర ప్రదర్శనలో 10వ తరగతి విద్యార్థిని వి.ఆశ గైడ్ టీచర్ విజయకుమారి పర్యవేక్షణలో వై మై మదర్ లూసింగ్ హర్ టీత్ వైల్ కటింగ్ షాంపూ సాచెట్స్ అనే ప్రాజెక్టును ప్రదర్శించింది. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం సుబ్బరాయన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆసరా చెక్కుల పంపిణీ రేపు

యాదమరి: మండలంలోని డ్వాక్రా మహిళలకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఆసరా చెక్కులను శుక్రవారం పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీఓ సింగయ్య తెలిపారు. ఎంపీడీఓ కార్యాలయం వద్ద మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహించే ఈ కార్యక్రమానికి అధికారులు అందరూ హాజరు కావాలని కోరారు.

చిత్తూరులో సభకు హాజరైన ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ విజయానందరెడ్డి





గుడిపాల: ఫ్యాన్ గుర్తుకే ఓటు అంటూ విజయానందరెడ్డికి చెబుతున్న యువత



జగనన్నను మళ్లీ సీఎం చేసుకుందాం

- ఎన్నికల సీజన్‌లో వచ్చే నాయకులను నమ్మొద్దు
- చిత్తూరు నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి
- గుడిపాలలో వైఎస్సార్ ఆసరా మెగా చెక్కు పంపిణీ



గుడిపాల: మహిళా సభ్యులకు ఆసరా చెక్కును అందజేస్తున్న విజయానందరెడ్డి

గుడిపాల: మహిళా సంఘాల సభ్యులు రుణాలు నాలుగు విడతల్లో చెల్లించిన జగనన్నకు మరోసారి సీఎం చేసుకొని రుణం తీర్చుకోవాలని చిత్తూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త విజయానందరెడ్డి మహిళలను కోరారు. మండల కేంద్రంలో బుధవారం వైఎస్సార్ ఆసరా కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో 99 శాతం నెరవేర్చిన ఏకైక సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. 2014 ఎన్నికల్లో మహిళా సంఘాల అప్పులన్నీ తీరుస్తానని హామీ ఇచ్చిన టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు అధికారంలోకి వచ్చి అప్పులు తీర్చకుండా అక్కాచెల్లెమ్మలను మోసం చేశారన్నారు. అదే జగనన్న చెప్పిన మాట ప్రకారం అక్కాచెల్లెమ్మల రుణాలన్నీ చెల్లించి రుణవిముక్తులుగా చేశారు. మండలంలో 761 గ్రూపులకు గాను 6860 మంది సభ్యులకు నాలుగేళ్లలో రూ. 26.72కోట్లు మాఫీ చేయగా ప్రస్తుతం నాలుగో విడతగా మండలానికి రూ.6.68 కోట్లు ఇచ్చినట్లు తెలిపారు. ఆరోగ్యశ్రీ పరిధిని రూ.5లక్షల నుంచి రూ.25లక్షల వరకు పెంచారన్నారు.

సాధ్యం కాని హామీలిచ్చిన చంద్రబాబు

చంద్రబాబు బూటకపు హామీలను నమ్మొద్దని విజయానందరెడ్డి సూచించారు. ఎన్నికల సమయంలో పక్క రాష్ట్రం నుంచి వచ్చిన చంద్రబాబు అలవిగాని హామీలు ఇస్తున్నారని చెప్పారు. నవరత్నాల పథకాలతో అందరి జీవితాల్లో వెలుగులు నింపిన జగనన్నకు ప్రతి ఒక్కరూ అండగా ఉండి ఆశీర్వదించాలన్నారు.

ఫ్యాను గుర్తుకు ఓటేయండి

జగనన్న చేసిన మేలును గుర్తించి ఫ్యాన్ గుర్తుకు ఓటువేసి ఆశీర్వదించాలని విజయానందరెడ్డి అన్నారు. మండలంలోని శ్రీరంగంపల్లె పంచాయతీలో ఇంటింటా వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా మన రాష్ట్రంలోనే రూ. 3వేల పింఛన్ ఇంటికే అందజేస్తున్నట్లు చెప్పారు. అదికూడా ఒకటవ తేదీన ఉదయమే వలంటీర్లు లబ్ధిదారుల ఇంటివద్దకు వెళ్లి పింఛన్ ఇస్తున్నట్లుపేర్కొన్నారు. ఇక సంక్షేమ విషయానికొస్తే అర్హతే ప్రామాణికంగా అందరికీ పథకాలు వర్తింపచేస్తున్నారు. అమ్మ ఒడి, చేయూత, చేదోడు, పేదలందరికీ ఇళ్లు తదితర పథకాలను అందించడంతో ప్రజలపై ఎటువంటి ఆర్థిక భారం పడలేదని చెప్పారు. ప్రభుత్వం విద్య, వైద్యానికి పెద్దపీట వేసిందని, నాడు–నేడు కింద ప్రభుత్వ పాఠశాలలు, ఆస్పత్రులను బలోపేతం చేసినట్లు గుర్తుచేశారు. జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉంటే సంక్షేమం, అభివృద్ధి కొనసాగుతాయని స్పష్టం చేశారు. టీడీపీ, జనసేన పార్టీలను ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. కార్యక్రమాల్లో జెడ్పీ వైస్ చైర్మన్ రమ్య, ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు జనార్దన్, స్పెషలాఫీసర్ మధుసూదన్‌రెడ్డి, ఎంపీడీవో రాజశేఖర్‌రెడ్డి, ఏపీఎం సుధారాణి, వెలుగు సీసీలు హేమచంద్రారెడ్డి, లోకనాథరెడ్డి, మల్లీశ్వరి, వైఎస్సార్‌సీపీ నాయకులు మధుసూదన్ రెడ్డి, రజనీకాంత్, మధుసూదన్‌రాయల్, గోళ్ల హరి ప్రసాద్, శిలంబరసన్, రవి, రఘు, డానియల్, కారిమేఘన్, శింభు, వెంకటేష్‌రెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, రాజా, రవియాదవ్, రమేష్, గుండుసాయి, శేఖర్, యోవాన్, రవీంద్రారెడ్డి, గుణశేఖర్‌లతో పాటు కార్యకర్తలు పాల్గొన్నారు.

హామీలన్నీ నెరవేర్చిన ఘనత జగనన్నదే

చిత్తూరు రూరల్: ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డినే మళ్లీ గెలిపించుకోవాలని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి పిలుపునిచ్చారు. చిత్తూరు నగరంలోని సంతపేటలో బుధవారం రాత్రి భారీ బహిరంగ సభను నిర్వహించారు. స్థానిక కరుమారియ్మ ఆలయంలో పూజలు చేసి సంతపేట రోడ్డు మీదుగా రోడ్ షో ప్రారంభించారు. డప్పువాయిద్యాలు, జనసందడి, సన్మానాల నడుమ ఈ షో 45 నిమిషాల పాటు కొనసాగింది. అనంతరం సభకు హాజరైన అశేష జనసందోహాన్ని ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. జగనన్న మహిళల పక్షపాతి అని, అందుకే ప్రతి పథకాన్ని అక్క చెల్లెమ్మల పేరిట అమలు చేస్తున్నారని గుర్తుచేశారు. మహిళలు పథకాలను సద్వినియోగం చేసుకుంటున్నారని గుర్తుచేశారు. సామాజిక పింఛన్లను ప్రభుత్వం తలుపు తట్టి అందజేస్తోందని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో మాత్రమే కనిపించే నాయకులను ఎవరూ నమ్మొద్దని సూచించారు. వైఎస్సార్‌సీపీతోనే ఈ రాష్ట్రాభివృద్ధి సాధ్యమన్నారు. అన్ని వర్గాలకు సమన్యాయం అమలు చేస్తోందని స్పష్టం చేశారు. జగనన్న అమలు చేస్తున్న పథకాల వల్ల ప్రతి ఇంటికీ లబ్ధి చేకూరిందని పేర్కొన్నారు. ఆ మేలును మర్చిపోకుండా మళ్లీ జగనన్న నాయకత్వాన్ని బలపర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో మేయర్ అముద, డిప్యూటీ మేయర్లు చంద్రశేఖర్, రాజేష్‌కుమార్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ రాహుల్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు భూపేష్ గోపినాథ్, కార్పొరేటర్లు జ్ఞాన జగదీష్, నారాయణ, హరిణిరెడ్డి, నాయకులు కేపీ శ్రీధర్, సీకే ద్వారక, అప్పుజీ, సెంతామరై, దివాకర్ తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో పక్కాగా సౌకర్యాలు



పోలింగ్ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కమిషనర్ అరుణ



బంగారుపాళెం : పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న రిటర్నింగ్ అధికారి శివ



సభ్యులకు వీవీ ప్యాడ్స్ ద్వారా అవగాహన కల్పిస్తున్న డీటీ మహేశ్వరి

చిత్తూరు అర్బన్: ఎన్నికల కమిషన్ నిర్దేశించిన మేరకు పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు పక్కాగా ఉండాలని ఏఈఆర్వో, నగర కమిషనర్ అరుణ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. కమిషనర్ నగర పాలక సంస్థ పరిధిలోని బుధవారం ఉదయం 1, 2, 3, 4, 50, 40 వార్డు పరిధిలో 11, 7, 8, 12, 13, 18, 19, 20, 24, 9, 10, 27 పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. కేంద్రాల్లో ఇటీవల చేపట్టిన పనులను తనిఖీ చేశారు. పోలింగ్ కేంద్రాల్లో విద్యుదీకరణ పనులను తనిఖీ చేసి లైట్లు, ఫ్యాన్లు సక్రమంగా పనిచేస్తున్నాయా అని పరిశీలించారు. నీటి సరఫరా, మరుగుదొడ్లకు నీటి సౌకర్యం, ఫర్నిచర్, ర్యాంపుల నిర్మాణాలను పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల ఆవరణాల్లో ఇతరత్రా మెటీరియల్ లేకుండా చూడాలన్నారు. ఎంఈ గోమతి, డీఈలు వెంకట ప్రసాద్, రమణ, ఏఈలు రజని, లోకేష్, రవీంద్ర, బీఎల్వోలు, అమినిటీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు చేపట్టాలి

బంగారుపాళెం: పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాట్లు చేపట్టాలని పూతలపట్టు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి శివ ఆదేశించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను బుధవారం రిటర్నింగ్ అధికారి తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ, సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా నియోజకవర్గంలోని పోలింగ్ కేంద్రాల్లో తగు ఏర్పాట్లను పూర్తి చేయాలన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద విద్యుత్ సౌకర్యం, వృద్ధులు, దివ్యాంగుల కోసం ర్యాంపులు, ప్రతి పోలింగ్ స్టేషన్‌లో మూడు త్రీపిన్ సాకెట్లు ఏర్పాటు చేయాలని సూచించారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు కృషి చేయాలన్నారు. తహసీల్దార్ సుభద్రమ్మ, ఆర్ఐ దీపక్ రెడ్డి, హెచ్ఎం రాధాకృష్ణ పాల్గొన్నారు.

ఓటుపై అవగాహన

పూతలపట్టు: రాబోయే ఎన్నికల్లో నూతన ఓటర్లకు ఓటు హక్కుపై అవగాహన కల్పించాలని డీటీ(ఎన్నికలు) మహేశ్వరి తెలిపారు. మండలంలోని వెలుగు కార్యాలయంలో బుధవారం డ్వాక్రా సంఘం సభ్యులకు ఓటు వేసేవిధానాన్ని తెలియపరిచారు. వీవీ ప్యాడ్స్‌లో ఓటు హక్కు వేసే పద్ధతిని, సంక్షిప్తంగా వివరించారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. సభ్యురాలు పరిధిలోని గ్రామ ప్రజలకు ఓటు వల్ల కలిగే ప్రయోజనాలను వివరించాలని సూచించారు. నూతనంగా ఓటు నమోదు చేసుకున్న ఓటర్లు ఖచ్చితంగా ఓటును వినియోగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం నాగరత్న, సీసీలు, సభ్యులు పాల్గొన్నారు.

టిడ్కో గృహాల్లో పనులు పూర్తి చేయండి



టిడ్కో ఇళ్ల పరిశీలనలో కమిషనర్ అరుణ

చిత్తూరు అర్బన్: నగరపాలక సంస్థ పరిధిలో పూనేపల్లి వద్ద నిర్మించిన టిడ్కో గృహ సముదాయాల్లో అసంపూర్తిగా ఉన్న పనులను త్వరగా పూర్తి చేయాలని నగర కమిషనర్ అరుణ సంబంధిత అధికారులను ఆదేశించారు. కమిషనర్ బుధవారం ఉదయం టిడ్కో గృహ సముదాయాలను తనిఖీ చేశారు. గృహాల్లో పూర్తయిన పనులను తనిఖీ చేసి, నీటి సరఫరా, ఇతర సౌకర్యాలను పరిశీలించారు. జరుగుతున్న పనులపై అధికారులకు పలు సూచనలు చేశారు. పెండింగ్ ఉన్న వాటర్ పైప్‌లైన్, విద్యుదీకరణ పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. గృహ సముదాయం ఆవరణాన్ని శుభ్రం చేయించాలని ఆదేశించారు. నగరపాలక సంస్థ నీటి శుద్ధి కేంద్రాన్ని పరిశీలించారు. పనులన్నింటినీ వారం రోజుల్లో పూర్తి చేయించాలని టిడ్కో ఈఈ వెంకటముని, కాంట్రాక్టర్లకు సూచించారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ శ్రీధర్, టిడ్కో కన్సల్టెంట్ ధనుంజయ రెడ్డి పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు ఆభా కార్డులు

చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్‌లో అవుట్ సోర్సింగ్ కార్పొరేషన్ (ఆప్కాస్)లో పనిచేస్తున్న కార్మికులు అందరికీ త్వరలోనే ప్రధాన మంత్రి ఆయుష్మాన్ భారత్ హెల్త్ కార్డులను అందజేయనున్నట్లు కమిషనర్ అరుణ అన్నారు. కార్పొరేషన్ కార్యాలయంలో బుధవారం ఈఎస్ఐ అధికారులతో కలిసి కార్మికులకు ఆధార్ సీడింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ, ఆప్కాస్ పరిధిలో పని చేస్తున్న కార్మికులకు వారి ఆధార్ నెంబర్లను ఈఎస్ఐ కార్డులతో అనుసంధానించుకోవాలని చెప్పారు. దీని ద్వారా ఆయుష్మాన్ భారత్ హెల్త్ ఖాతాలను, కార్డులను పొంది దేశ వ్యాప్తంగా ఉచిత వైద్య సేవలను పొందే అవకాశం ఉంటుందన్నారు. కార్పొరేషన్ కార్యాలయంలో 500 మంది ఉద్యోగుల వివరాలు ఆధార్ సీడింగ్ చేయడానికి మూడు రోజుల పాటు ఇక్కడే స్పెషల్ డ్రైవ్ చేపడుతున్నట్లు వివరించారు. ఈ అవకాశాన్ని కార్మికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో కార్పొరేషన్ ప్రజారోగ్యశాఖ అధికారి డా.లోకేష్, ఈఎస్ఐ బ్రాంచ్ మేనేజరు షేక్ సెహనాజ్ తదితరులు పాల్గొన్నారు.

పుల్వామా అమర వీరులకు నివాళి



నివాళులర్పిస్తున్న విద్యార్థినులు

చౌడేపల్లె: పుల్వామా దాడిలో అమరులైన వీర జవానులకు బుధవారం ప్రజాప్రతినిధులు, అధికారులు నివాళులర్పించి, రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన ఈకార్యక్రమంలో వైఎస్ ఎంపీపీ సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ 2019 ఫిబ్రవరి 14న జమ్మూ కాశ్మీర్‌లోని పూల్వామాలో ఉగ్రమూకల దాడిలో 40 మంది భారత జవానులు వీర మరణం పొందారని గుర్తుచేశారు. పాకిస్తాన్ ఉగ్రమూకల దాడిలో భీకర పోరులో అమరులైన ప్రతిసైనికుడికి ఘన నివాళులర్పించారు. వారి ఆత్మలకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఎంపీపీ రామమూర్తి, పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో..

పులిచెర్ల(కల్లూరు): పుల్వామా దాడిలో మృతి చెందిన అమరవీరులకు కల్లూరు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం శ్రద్ధాంజలి ఘటించారు. క్లబ్ క్రీడా విభాగం అధ్యక్షుడు మహమ్మదాలీ ఆధ్వర్యంలో కొవ్వొత్తులు వెలిగించి నివాళులర్పించారు. విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామీణులకు సకాలంలో వైద్యసేవలు





గుడిపాల: వైద్యసేవలందిస్తున్న డాక్టర్ రష్మిత, తవణంపల్లె: వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ వినయ్‌కుమార్

గుడిపాల: ప్రతి గ్రామంలో ప్రజలకు సకాలంలో వైద్యసేవలు అందిస్తున్నామని డాక్టర్ రష్మిత అన్నారు. మరకాలకుప్పం గ్రామంలో బుధవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి గ్రామంలో వైద్యసేవలు అందిస్తున్నట్లు వివరించారు. వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ల ద్వారా మంచం పట్టిన రోగుల ఇంటి వద్దకే వెళ్లి వైద్యం చేయనున్నట్లు తెలిపారు. అనంతరం గర్భిణులు, సుగర్ బాధితులకు చికిత్స చేసి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. 66 మంది రోగులకు చికిత్సలు నిర్వహించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది శాంతకుమారి, యమున, దివ్య, శ్రీలత, దేవప్రీత, రాధ పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

తవణంపల్లె: ఫ్యామిలీడాక్టర్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారులు మోహన్‌వేలు, వినయ్‌కుమార్ తెలిపారు. మండలంలోని సరకల్లులో డాక్టర్ మోహన్‌వేలు 62 మందికి, కొండ్రాజుకాలువలో డాక్టర్ వినయ్‌కుమార్ 55 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు, మాత్రలు అందజేశారు. అదే విధంగా గర్భవతులకు, బీపీ, సుగర్‌వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించి సూచనలు, సలహాలిచ్చారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు. మండలంలోని చెర్లోపల్లెలో జాతీయ సేవా పథకం కింద అరగొండ అపోలో నర్సింగ్ కళాశాలలో డాక్టర్ యశ్వంత్ 55 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. పాఠశాలలోని విద్యార్థులకు వైద్య పరీక్షలు చేయించి సూచనలు, సలహాలిచ్చారు.

మహిళల ఆర్థికాభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం



మహిళా సంఘ సభ్యులకు మెగా చెక్కును అందజేస్తున్న సునీల్‌కుమార్, నాయకులు

ఐరాల: మహిళల ఆర్థికాభ్యున్నతే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సునీల్ కుమార్ అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో బుధవారం వైఎస్సార్ ఆసరా నాలుగో విడత చెక్కు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా డాక్టర్ సునీల్‌కుమార్ హాజరయ్యారు. మండలంలో 1,115 సంఘాల మహిళలకు మంజూరైన రూ.11,71,69000 చెక్కును నాయకులు, అధికారులతో కలిసి మహిళ సభ్యులకు అందజేశారు. ఆయన మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లోనూ రాణించి, ఆర్థికంగా నిలదొక్కుకోవాలన్నాదే సీఎం జగనన్న లక్ష్యమని, ఆ దిశగా ఎన్నో పథకాలు, కార్యక్రమాలు అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా విడుదల చేసిన నిధులు మహిళలకు ఎంతో మేలు చేశాయన్నారు. చాలామంది ఈ సొమ్మును సద్వినియోగం చేసుకుని, ఉపాధి బాట పట్టి, కుటుంబానికి అండగా నిలిచారన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నూటికి నూరుశాతం అమలు చేసి దేశంలో ఆదర్శ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిలిచారని కొనియాడారు. ఫ్యాను గుర్తుకు ఓటు వేసి తనను ఆశీర్వదించి, జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిగా చేయాలని కోరారు. రానున్న ఎన్నికల్లో మహిళలు అందరూ జగనన్నకు పూర్తి స్థాయిలో అండగా నిలవాలన్నారు. అధికారంలో ఉన్నప్పుడు ప్రజా సంక్షేమాన్ని గాలికి వదిలేసిన టీడీపీ నేత చంద్రబాబు ఇప్పుడు ఎన్నికల జిమ్మిక్కులు చేస్తున్నారని ఘాటుగా విమర్శించారు. టీడీపీ పాలనలో దోచుకో.. దాచుకో.. పంచుకో తప్ప ప్రజలకు చేసింది ఏమీ లేదన్నారు. పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అందజేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనన్నారు. అనంతరం జగనన్న చిత్రపటానికి మహిళలతో కలిసి సునీల్‌కుమార్ క్షీరాభిషేకం చేశారు.

ప్రతి మహిళా ఆర్థిక పురోభివృద్ధే లక్ష్యం

ప్రతి మహిళా ఆర్థిక పురోభివృద్ధి సాధించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కృషి చేస్తున్నారని మహిళ, శిశు సంక్షేమ శాఖ రాయలసీమ రీజినల్ చైర్‌పర్సన్ శైలజ అన్నారు. ఎన్నికల సమయంలో వచ్చే టీడీపీ నేతలు చెప్పే మాయమాటలు నమ్మి అక్కచెల్లెమ్మలు మోసపోవద్దన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీపీ మోహన్, జెడ్పీటీసీ సభ్యురాలు సుచిత్ర, సింగిల్ విండో అధ్యక్షుడు ధనచంద్రారెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, మండల పార్టీ నేతలు, ఇన్‌చార్జి ఎంపీడీఓ కుసుమకుమారి, ఏపీఎం ప్రసాద్ పాల్గొన్నారు.

ఘనంగా వసంత పంచమి

పలమనేరు: పట్టణంలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలోని శ్రీసరస్వతి దేవి సన్నిధిలో బుధవారం వసంత పంచమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పంచమి గడియలు రాగానే ప్రత్యేక పూజలను చేపట్టారు. లలిత సంగీత విద్యార్థులు అన్నమాచార్య సంకీర్తనలను ఆలపించారు. ఇదే కార్యక్రమం పట్టణంలోని చైతన్య పాఠశాలలోనూ నిర్వహించారు. అక్షరాభ్యాస మహోత్సవాన్ని నిర్వహించారు.

గురుకులంలో ఘనంగా సరస్వతీ పూజ

రొంపిచెర్ల: రొంపిచెర్ల కస్తూర్బా గురుకుల పాఠశాలలో బుధవారం వసంత పంచమిని పురస్కరించుకుని శ్రీసరస్వతీదేవి పూజను ఘనంగా నిర్వహించారు. ఎంఈఓ శ్రీనివాసులు మాట్లాడుతూ ఇంటర్, పదవ తరగతి విద్యార్థులు పట్టుదలతో చదవి మంచి మార్కులు సాధించాలని సూచించారు. ఎస్‌వో సుజాత, ఉపాధ్యాయులుపాల్గొన్నారు.



హోమపూజల్లో పాల్గొన్న భక్తులు